



రకాలతోనే లాభాలు

నాకున్న 21 ఎకరాల్లో బేనీషా 10 ఎకరాల్లో సాగు చేశా.25 టన్నుల దిగుబడి వచ్చింది. అలాగే ఖాదర్ 3 ఎకరాల్లో 10 టన్నులు, మల్లిక 3 ఎకరాల్లో 8 టన్నులు, నీలం 2 ఎకరాల్లో 25 టన్నులు, తోతాపురి 3 ఎకరాల్లో 18 టన్నులు దిగుబడి వచ్చింది. బేనీషా కిలో రూ.20, ఖాదర్ రూ.35, మల్లిక రూ.38, నీలం రూ.16 చొప్పున అమ్మి లాభాలు పొందా.తోతాపురికి సబ్సిడీ మినహా ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద ధరల్లేవు.

- సుధాకర రెడ్డి, మతుకువారిపల్లె, పులిచెర్ల మండలం



చెక్కర గుట్లి



మల్లిక



బేనీషా




తోతాపురి నష్టం రకాలతోనే పూడింది

నాకున్న నాలుగెకరాల్లో హిమాం పసంద్, మల్లిక, బేనీషా వంటి రకాలను ఎకరాలో సాగు చేశా. మిగిలిన మూడెకరాల్లో తోతాపురి కాస్తున్నాయి. ధర లేక తోతాపురితో పూర్తిగా నష్టపోతే, టేబుల్ వెరైటీస్‌తో సుమారు రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది.

- కృష్ణమూర్తి, మిట్టపల్లె , తవణంపల్లె మండలం



మలగూబ



హిమాంపసంద్

ఆదుకుంటున్న రకాలు

● తోతాపురి నష్టాల్ని పూడ్చుతున్న టేబుల్ వెరైటీస్

చిత్తూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం కాయల్ని గిట్టుబాటు ధరలేకపోవడంతో అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్న మామిడి రైతులను రకాలుగా పేరు పడ్డ టేబుల్ వెరైటీస్ ఆదుకుంటున్నాయి. జిల్లాలో చాలా మంది రైతులు తోతాపురితో నష్టాలు చవిచూసినా, రకాల కాయల్ని అమ్ముకుని నష్టాలను తగ్గించుకోగలుగుతున్నారు.జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాల్లో తోతాపురి రకం సాగులో ఉండగా.. 40 వేల ఎకరాల్లో టేబుల్ వెరైటీస్ సాగులో ఉన్నాయి. ఈసారి కాపు బాగా రావడంతో తోతాపురి రకం 5 లక్షల టన్నులు, రకాల కాయలు లక్షన్నర టన్నులకుపైగా దిగుబడి ఉంటుందని అంచనా వేశారు.దిగుబడి బాగుందనుకుని సంతోషపడ్డ తోతాపురి ధర పతనం కావడంతో రైతులకు దిక్కుతోచడం లేదు.ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించి ఆదుకున్నా జ్యూస్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద కేజీ కాయలకు రూ.2నుంచి రూ.5వరకే రైతుకు దక్కుతోంది. కొన్నేళ్లుగా మామిడి ఉత్పత్తులకు డిమాండ్ లేకుండా పోయింది. దీంతో పల్ప్ నిల్వలు జ్యూస్ ఫ్యాక్టరీల్లో పెద్దఎత్తున మగ్గుతుండడంతో తోతాపురి రకాలకు డిమాండ్ లేకుండా పోయింది. ఇదే సమయంలో రకాల కాయలు సాగు చేసిన రైతులకు లాభాలు దక్కుతున్నాయి.తినడానికి, ఎగుమతులకు పనికొచ్చే ఈ కాయలు దిగుబడి తక్కువైనా మంచి ధర లభిస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు.వీటికి కూడా సీజన్ దాదాపు పూర్తవుతుండడంతో మంచి ధరలు లభిస్తున్నాయి. మామిడి సాగు ఇప్పటికే ఎక్కువకాగా ఇంకా పెరిగితే ఈ ఏడాది కంటే దారుణమైన పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సివస్తుందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. మామిడి సాగుకు 2007నుంచి ఉపాధిహామీ పథకం తోడ్పడుతుండడంతో రైతులు విపరీతంగా సాగు చేశారు. వచ్చే ఏడాది నుంచి తోతాపురి రకం సాగు చేసుకునేవారికి మాత్రం ఈ ప్రోత్సాహకాలు ఇవ్వకూడదని జిల్లా యంత్రాంగం నిర్ణయించినట్లు సమాచారం.

మామిడి రకం	సాగు (ఎకరాల్లో..)	దిగుబడి అంచనా (టన్నుల్లో..)
తోతాపురి	99,738	4,98,350
బేనీషా	9137	38,948
నీలం	14545	58,180
మల్లిక	4350	17,400
అల్‌ఫోన్సో	7817	39,085
ఇతర రకాలు	3815	17,167
మొత్తం	1,40,002	6,69,130



కవర్లు కట్టడంతో లాభపడ్డా

16 ఎకరాల మామిడి తోపులో టేబుల్ వెరైటీస్ కాయలకు కవర్ కట్టా. హిమాంపసంద్ కిలో రూ.120, ఖాదర్ రూ.51, మల్‌గూబ రూ.105, మల్లిక రూ.45, బేనీషా రూ.30నుంచి రూ.45 వరకు అమ్మాను. కలర్ తోతాపురి కాయల్ని కిలో రూ.18కి అమ్మాను. ఐదేళ్లుగా కవర్ కట్టి కాయల్ని మంచి ధరకు అమ్ముకుంటున్నా.గతేడాది కవర్ కట్టిన తోతాపురి రూ.65కు అమ్మాను.

- సుదర్శన్ నాయుడు, గుంతూరు, బంగారుపాళ్యం మండలం

మామిడి రకం	కిలో ధర (రూపాయల్లో..)
బేనీషా	రూ.28
బేనీషా (కవర్)	రూ.32
తోతాపురి కలర్	రూ.13
తోతాపురి	రూ.4- రూ.5
హిమాంపసంద్	రూ.110
కాలేపాడ్	రూ.60
మలగూబ	రూ.75
మల్లిక	రూ.47
నీలం	రూ.20 నుంచి 25

కుప్పంనుంచే 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'!

తిమ్మరాజుపల్లెలో ఎల్లుండి ప్రారంభించనున్న సీఎం

ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రతిష్ఠాత్మక కార్యక్రమం

రేపే కుప్పానికి చేరుకోనున్న చంద్రబాబు



సభా వేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ తదితరులు

ఏడాదికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' అనే వినూత్న కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని సొంత నియోజకవర్గమైన కుప్పంనుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. శాంతిపురం మండలం తిమ్మరాజు పల్లెలో ఈనెల 2వ తేదీన 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించడానికి, అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.తుమ్మిశివద్ద బహిరంగ సభ కూడా అదే రోజు జరుగనుంది ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి కుప్పం పర్యటనకు రానున్నారు.

కుప్పం/శాంతిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గమైన కుప్పంలో టీడీపీని పటిష్ఠం చేయడంతోపాటు ప్రభుత్వం ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించడానికి తగిన విధంగా ప్రణాళికను చంద్రబాబు సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే శాంతిపురం మండలం కడపల్లె వద్ద ఇల్లు కట్టుకుని గృహప్రవేశం కూడా చేశారు. తరచూ నియోజకవర్గాన్ని సందర్శిస్తూ తెలుగు దేశం పార్టీని పటిష్ఠం చేయడానికి, అధికార వర్గాలను మరింతగా నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే 2వ తేదీన 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కుప్పం నుంచే ప్రారంభించనున్నారు. మంగళవారం రాత్రికి కుప్పం చేరుకోనున్న చంద్రబాబు కడపల్లెలోని సొంతింట్లో రాత్రి బస చేస్తారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ తిమ్మరాజు పల్లె గ్రామం, 49వ బూత్ నెంబరు పరిధిలో ఆయన నిర్మించుకున్న స్వగృహం ఉంది. ఇందువల్ల ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఇక్కటినుంచే ప్రారంభించనున్నారు. తిమ్మరాజు పల్లె గ్రామంలోని 49వ బూత్ నెంబరు పరిధిలో మొత్తం 1309 మంది ఓటర్లున్నారు. ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 2వ తేదీ ఉదయం వీరిలో కొంత మంది ఇళ్లకు ఆయన వెళ్లి, కుటుంబ సభ్యులను పలకరించి, వారి సాదకబాదకాలు అడిగి తెలుసుకుంటారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి వివరిస్తారు. ఎవరికైనా సమస్యలుంటే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇస్తారు.తర్వాత తుమ్మిశి మోడల్ స్కూల్ ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చేరుకుంటారు. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తారు. వివిధ శాఖల ద్వారా వివిధ పథకాల కోసం బ్యాంకులు మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేస్తారు. ఏస్ ఇండస్ట్రీస్, ఈ రాయిస్, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ అనే కంపెనీలతో కడా తరపున ఎంవోయూలు కుదుర్చుకుంటారు. వీటిలో ఏస్ ఇండస్ట్రీస్ అనేది పాల ద్వారా మెడిసన్‌కు సంబంధించిన ఉత్పత్తుల కంపెనీ కాగా, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ అనేది సోయా గింజల ద్వారా ఆహార ఉత్పత్తుల కంపెనీ. ఇక ఈ రాయిస్ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కంపెనీ. ఈ కంపెనీ ద్వారా 130 ఎలక్ట్రిక్ ఆటోలను ముఖ్యమంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, సబ్సిడీ మీద అందిస్తున్న ఎలక్ట్రిక్ సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. అలాగే కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ భాగస్వామ్యంతో టాటా కన్సల్టెన్సీ ద్వారా ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ)ను ప్రారంభిస్తారు.సాయంత్రం తుమ్మిశి పంచాయతీ డుంకుమానుపల్లె సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు.

అధికార వర్గాల హడావుడి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రెండు మూడు రోజులుగా కుప్పంలో జిల్లా, స్థానిక అధికారుల హడావుడి ఎక్కువైంది. ఆదివారం సైతం కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు ఇతర స్థానిక అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. తుమ్మిశి మోడల్ స్కూల్లో నిర్మాణమవుతున్న సభా వేదిక వద్దకు వెళ్లి సూచనలు చేశారు. ఇంటింటికీ మంచి ప్రభుత్వం ప్రారంభించనున్న తిమ్మరాజు పల్లెలో కూడా కలెక్టర్ పరిశీలన సాగింది. ఇక్కడ వీధులన్నీ పరిశుభ్రమవుతున్నాయి. గ్రామం అద్దంలా మెరుస్తోంది. పాడైపోయిన వీధి లైట్లను తొలగించి, ఆ స్థానంలో కొత్త లైట్లను బిగిస్తున్నారు. కాలువలు బాగు చేస్తున్నారు. రోడ్లను పూడుస్తున్నారు. సీఎం ఇంటినుంచి బైపాస్ కూడలికి వచ్చి, తిమ్మరాజు పల్లెకు వెళ్లే తారు రోడ్డులో సైతం కొన్ని మరమ్మతులు చేశారు. పరిశుభ్రంగా ఉంచారు. పథకాల అమలు, ప్రయోజకాల పంపిణీ, కంపెనీల ఎంఓయూలకు సంబంధించిన అన్నిరకాల రికార్డులను, అవసరమైన సరంజామా సిద్ధం చేస్తున్నారు.



సీఎం రాకకోసం పరిశుభ్రమవుతున్న తిమ్మరాజుపల్లెలోని ఒక వీధి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి తదితరులు

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఇన్‌చార్జి పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో 664 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండగా ఆదివారం 400 మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలినవారికి సోమవారం ఉంటుంది. కాగా, కౌన్సెలింగ్ ప్రారంభంలో ఉద్యోగులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఖాళీగా ఉన్న ప్రాంతాల వివరాలు ప్రదర్శించాలని ఉద్యోగులు కోరారు. ఖాళీగా ఉన్నా.. తాము కోరుకున్న చోటు కాకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపిస్తూ కొంతసేపు ఆందోళన చేశారు. ఖాళీలను ప్రదర్శించడానికి పెద్ద డిజిటల్ స్క్రీన్లు తమ వద్ద లేవని అధికారులు చెప్పడంతో ఉద్యోగులు అసంతృప్తిగానే కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

మహిళా పోలీసుల కౌన్సెలింగ్‌లో రగడ

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీ కౌన్సెలింగ్‌లో రగడ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక పీటీసీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీసు పూర్తయిన సుమారు 1,200 మంది మహిళా పోలీసులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా ఖాళీల వివరాలను చూపించి బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. తొలుత అంధులు, విడోలు, స్పౌజ్, దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ కేటగిరీల్లోని వారికి బదిలీలు చేపట్టారు. ఇది సరికాదని, ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అరుపులు, కేకలు వేయడంతో ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని జిల్లాల్లో ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపట్టారని, పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ ప్రక్రియ చేస్తున్నామని చెప్పారు. ఆందోళనలు చేయాలనుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాంతో అందరూ మిన్నకుండిపోయారు. ఆదివారం మిగిలిన వారికి సోమవారం కూడా బదిలీ కౌన్సెలింగ్ జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

బోయకొండలో భక్తుల రద్దీ



అలంకరణలో బోయకొండ గంగమ్మ

● అమ్మవారిని దర్శించుకున్న 30 వేలమంది భక్తులు

● సేవా టిక్కెట్లతో రూ.17 లక్షల ఆదాయం

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తుల నామ్మరణతో ఆలయం మార్మోగింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అమ్మవారి భక్తులు ఎంజీకే గాయత్రి ఫ్లవర్ స్టాల్, జేఎంఎస్ అన్నపూర్ణేశ్వరీదేవి ఫ్లవర్ స్టాల్ యజమానులు కృష్ణ, శ్రీదేవి, గుణశేఖర్, లావణ్య 1500 కిలోల పూలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. వివిధ సేవా టిక్కెట్లతో ఒక్కరోజులో అమ్మవారికి రూ.17 లక్షల ఆదాయం చేకూరింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు(పైన) కర్ణాటక భక్తులు కానుకగా ఇచ్చిన పూలతో అలంకరణ

కలెక్టరేట్‌లో, ఎస్పీ ఆఫీసులో నేటి 'పీజీఆర్ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవ్వరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి ఎవ్వరూ రావద్దని సూచించారు.

సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయకండి

వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):బదిలీ అయిన గ్రామ సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయొద్దంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎందుకంటే సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. కాబట్టి జూలై నెల పింఛన్ల పంపిణీ పూర్తయ్యేవరకు బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయవద్దని కలెక్టర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఉత్తర్వులిచ్చింది.



మనవడు వేహాంత్‌తో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందనలందుకుంటున్న మోహన్

'కలంకారీ మోహన్'కు రాష్ట్రపతి అభినందన

కలంకారీ కళాకారుడిగా విశేష గుర్తింపు పొందిన తలిశెట్టి మోహన్, ఆయన మనవడు వేహాంత్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు. శ్రీకాళహస్తిలోని కంఠావీధికి చెందిన మోహన్ కలంకారీ చిత్రాలు రూపొందించడంలో ప్రసిద్ధులు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలంకారి విభాగంలో అవార్డు అందుకున్నారు. గత నెలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వివిధ హస్తకళలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కలంకారిలో 50 మందికి మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వాలని మోహన్‌ను అధికారులు ఆహ్వానించారు. ఆయన మనవడు వేహాంత్ అమెరికాలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారసత్వంగా ఈ కళలో ప్రావీణ్యం పొందాడు. చిన్నతనం నుంచే కలంకారీ చిత్రాలు గీయడంలో పట్టు సాధించాడు. ఆరో తరగతి చదువుతున్న ఈ బాలుడు అమెరికా నుంచి ఇటీవల ఇండియాకు వచ్చి తాతతోపాటు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యాడు. ఈక్రమంలో శనివారం రాష్ట్రపతి భవన్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. కలంకారీ శిక్షణ ఇచ్చిన మోహన్‌ను, బాల్యంలోనే ప్రతిభ చాటుతున్న వేహాంత్‌ను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అభినందించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నిత్యబాబు

స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలు

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సిబ్బందికి ఆదివారం స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలను నిర్వహించారు. త్వరలో జరగనున్న ఓపెన్ స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీకి ప్రీ ట్రయల్ నిమిత్తం స్థానిక సాయుధ దళం కార్యాలయంలో ఈ పోటీలు జరిగాయి. కానిస్టేబుల్ మార్కొండన్ ప్రథమ స్థానం, రాజేష్ రెండో స్థానం, తేజోవతి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి పోటీకి దరఖాస్తు చేసుకున్న ప్రజలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

సమ్మె బాటలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం నుంచి విధులను బహిష్కరించనున్నారు. ఈ మేరకు చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రధాన విభాగమైన మంచినీటి సరఫరా పనుల్లో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో పాల్గొనడం లేదని ఈ నోటీసులో పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికులందరూ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శరవణ, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కోశాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లగేజీ వ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనదారు దుర్మరణం

శ్రీరంగరాజపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లగేజీ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె దళితవాడకు చెందిన రమేష్(44) ఎస్ఆర్‌పురం క్షీరసముద్రం గ్రామంలో బంధువులు చనిపోతే ఆదివారం అక్కడికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యంలో మర్రిపల్లె వద్దకొచ్చేసరికి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై పళ్లిపట్టు నుంచి వేగంగా వస్తున్న లగేజీ వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యానుకున్న కమ్మీ తగులుకుని రమేష్ తల, మొండెం వేరయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చిరుత దాడిలో నెమలి మృతి

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడిలో నెమలి మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... చౌడేపల్లెకు చెందిన మహేష్‌కు పెద్దయల్లకుంట్ల వద్ద మామిడితోటలో ఆదివారం ఉదయం నెమలి మృతిచెంది ఉండటం రైతులు గుర్తించారు. అలాగే మృతి చెందిన ప్రదేశంలో చిరుతపులి కాలి గుర్తులు ఉండటం గుర్తించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రెండు నెలల క్రితం యల్లకుంట్ల సమీపంలోని గుట్ట వద్ద చిరుత సంచరించినట్లు పశువుల కాపరులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతపులి నుంచి ప్రమాదం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీటీడీ సేవలు ఎలా ఉన్నాయ్!

● కొనసాగుతున్న భక్తుల అభిప్రాయ సేకరణ



తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను మరింత మెరుగుపరిచేందుకు భక్తుల అభిప్రాయాలను సేకరించే ఫీడ్‌బ్యాక్ సర్వేను కొనసాగిస్తోంది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ ద్వారా ఈ-సర్వే, శ్రీవారిసేవకుల ద్వారా మాన్యువల్ సర్వేలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఐవీఆర్ఎస్ ఎలక్ట్రానిక్ సర్వే విధానం ద్వారా భక్తులు తిరుమలయాత్ర పూర్తి అనుభవం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూలైన్ల నిర్వహణ, లగేజీ కౌంటర్లపై మొత్తం 16 ప్రశ్నలతో తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

వాట్సాప్: తిరుమల, తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను భక్తులు తమ మొబైల్‌తో స్కాన్ చేస్తే '93993 99399' వాట్సాప్ నెంబరు ఓపెన్ అవుతుంది. ఇందులో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ద్వారా భక్తులు తమ పేరుతో, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు వంటివి) ఎంచుకుని తమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వచ్చు.

శ్రీవారి సేవకుల ద్వారా

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా శ్రీవారి సేవకులతో అభిప్రాయ సేకరణ జరుగుతోంది. టీటీడీ రూపొందించిన ప్రశ్నావళితో కూడిన అప్లికేషన్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని భక్తుల అభిప్రాయలను సేకరిస్తారు. త్వరలోనే టీటీడీ మొబైల్ యాప్, టీటీడీ బుకింగ్ పోర్టల్ నుంచీ అభిప్రాయ సేకరణ ప్రారంభించనున్నారు. భక్తుల అభిప్రాయాలను క్రోడీకరించి సేవలను మరింత మెరుగుపరిచే దిశగా టీటీడీ ఈ విధానాన్ని చేపట్టింది.

అద్భుత కథకుడు, కవి సి.వేణు

● ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో ప్రముఖుల వాణి

పలమనేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అద్భుతమైన కవిత్వంతో పాటు కలకాలం నిలిచిపోయే కథలను సృజించిన సి.వేణు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.పాలపిట్ట మాసపత్రిక ఆధ్వర్యంలో వెలువడ్డ సి.వేణు ప్రత్యేక సంచికను పలమనేరు లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఉదయం పలువురు సాహితీ ప్రముఖులు ఆవిష్కరించారు. సి.వేణు సాహిత్య వ్యక్తిత్వం గురించి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని మధురాంతకం నరేంద్ర నిర్వహించి ప్రసంగించారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం మండికృష్ణాపురం గ్రామంలో జన్మించిన వేణు ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ఉత్తేజకరమైన రచనలు చేశారని పచయిత మధురాంతకం నరేంద్ర పేర్కొన్నారు. నవ్విన ధాన్యరాశి కథల ద్వారా, మల్లెలు తూర్పుఎత్తినవేళ కవిత్వం ద్వారా అద్భుతమైన సాహిత్యాన్ని తెలుగులోకానికి అందించారన్నారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛత ప్రచురణల పక్షాన సి.వేణు కుమారుడు భానుమూర్తి రెడ్డి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ఆకాశవాణి మాజీ అధికారి ఆకుల మల్లేశ్వరరావు,రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి తదితరులు ఆయన రచనల గురించి మాట్లాడారు. పలమనేరు బాలాజి కథల సంపుటి ఏకలవ్య కాలనీ, కవితా సంపుటి లోప లేదో కదులుతున్నట్లు పుస్తకాల పరిచయ సభ ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఎరుకల జీవనగాథలను ఏకలవ్య కాలనీ పేరిట తొలిసారిగా వెలుగులోకి తీసుకొచ్చిన రచయిత పలమనేరు బాలాజి అని పేర్కొన్నారు.రచయితలు వి.ప్రతిమ, సుంకోజి దేవేంద్రాచారి తదితరులు బాలాజి రచనల గురించి ప్రసంగించారు.రచయితలు పల్లిపట్టు నాగరాజు,మంచికంటి, టీఎస్ఏ కృష్ణమూర్తి, కృష్ణస్వామిరాజు, కవితశ్రీ, ఎండపల్లి బారతి, పి.తులసినాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మధురాంతకం నరేంద్ర

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. మూడేళ్లుగా మండలంలో తిష్ట వేసిన ఏనుగుల మంద విడతల వారీగా పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. 30 ఏళ్లనాటి మామిడిచెట్లను సైతం ఏనుగుల గుంపు కూకటివేళ్లతో పెకలిస్తుండటంతో మామిడి రైతాంగానికి తీరని నష్టం జరుగుతోంది. బాధిత రైతులకు అటవీశాఖ తూతూ మంత్రంగా నష్ట పరిహారం చెల్లించడంతో వ్యవసాయంపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. శనివారం రాత్రి తూర్పు విభాగం అడవీ ప్రాంతం నుంచి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు రవి, లక్ష్మీపతిరెడ్డి మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి దిగుమూర్తివారిపల్లి మీదుగా కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు రైతు ధర్మేంద్రకు చెందిన బోరుమోటారును కదిలించాయి. డ్రిప్ పైపులు, ఫిల్టర్లను ధ్వంసం చేశాయి. మామిడిచెట్ల కొమ్మలు, రాతి కూసాలను విరిచేశాయి. అక్కడ నుంచి కోటపల్లి మీదుగా అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. ఏనుగులు వెళుతున్న మార్గంలో కోటపల్లిలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను తిని నేలరాల్చాయి. అనంతరం అడవిలోకి చేరుకున్నాయి. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను ఆదివారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. నష్ట పరిహారం అందించేందుకు సంబంధిత భూరికార్డులతో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆదివారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధు తెలిపారు.




కోటరాళ్ల వద్ద సంచరిస్తున్న ఏనుగులు - ఏనుగులు ధ్వంసం చేసిన బోరు మోటారు, ఫిల్టర్

బాబు ముందు మాట్లాడడం ఆనందకరం



టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు ముందు మాట్లాడడం ఆనందంగా ఉందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. ఆదివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొంతమందికి మాత్రమే మాట్లాడే అవకాశం లభించగా అందులో జగన్మోహన్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంస్థాగత కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు, కూటమి పార్టీల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. మంత్రి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందాం: యూటీఎఫ్



ఊరి పిల్లల్ని బడిలో చేర్పిద్దాం కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. 5వేల ఫౌండేషన్ పాఠశాలలు, 19వేల బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ రెండు రకాల పాఠశాలల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందన్నారు. వీటిని బలమైన పాఠశాలలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ.. పిల్లల్ని బడిలో చేర్పించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అనంతరం ఊరి బడిలో పిల్లలను చేరుద్దాం కరపత్రాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు రెహనా, రెడ్డెప్ప, బాషా, మునిరత్నం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు




స్వాధీనం చేసుకున్న వాహనాలు - నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.3లక్షల విలువైన చేసే ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు అతిథి గృహంలో ఒకటి, రెండో పట్టణ సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ ఆదివారం మీడియాకు వివరాలు తెలిపారు. కొంతకాలంగా చిత్తూరులోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతుండటంపై ఫిర్యాదులు అందాయి. ఈ చోరీలకు సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల్లో విచారణ ప్రారంభించారు. ఆదివారం పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ బలరామయ తన సిబ్బందితో కలిసి చిత్తూరు రెడ్డిగుంట జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. వేలూరు నుంచి చిత్తూరు వైపుగా వస్తూ పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు వెంబడించి తమిళనాడు రాష్ట్రం వేలూరు నెహ్రూనగర్‌కు చెందిన రాజేష్(20)ని పట్టుకుని, విచారించారు. ద్విచక్రవాహనాలను చోరీ చేసి, తక్కువ ధరలకు విక్రయించి.. ఆ డబ్బుతో జల్సాలు చేసేవాడని తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతడి వద్ద నుంచి రూ.3లక్షల విలువైన ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా డీఈవో బాధ్యతల స్వీకరణ



అధ్యాపక బృందంతో వరలక్ష్మి

వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్‌గా జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన శేఖర్ పదవీవిరమణ పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపకులు అభినందించారు.

టోకెన్లను అధికారులు అమ్మేశారు

● జైన్‌ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతుల ధర్నా




జైన్‌ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గంగాధరనెల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మామిడి టోకెన్లను అధికారులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె వద్ద ఉన్న జైన్ ఫ్యాక్టరీ ఎదుట చిత్తూరు - పుత్తూరు రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ట్రాక్టర్లలో మామిడికాయలను తీసుకొస్తే మూడు నుంచి నాలుగు రోజుల వరకు అన్‌లోడింగ్ చేయకుండా అధికారులతోపాటు ఫ్యాక్టరీ సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. సిఫార్సులు ఉన్నవారి వాహనాలను మాత్రం అర్ధరాత్రి వేళ ఫ్యాక్టరీలోకి ఏవిధంగా పంపిస్తారని ప్రశ్నించారు. తామంతా రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల తర్వాత కొందరు ట్రాక్టర్లను ఫ్యాక్టరీలోకి పంపించాక.. రిజెక్టు పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది కూడా రైతులపట్ల హీనంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. తమ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పలమనేరు మార్కెట్ యార్డులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పలమనేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌యార్డులో ఆదివారం ఉన్నట్లుండి పం డ్ల మండీలకు నిప్పంటుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. షేక్ అక్బర్‌బాషా, మహమ్మద్ మియాజ్‌లకు చెందిన దుకాణాలు పాక్షికంగా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.



సైన్స్‌సెంటర్‌లో వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఇది మంచి ప్రయత్నం

ట్యాగ్ ఏ ట్రీ ద్వారా వృక్షాలకు సంబంధించిన విషయాలతో పాటు ఔషధ ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవడానికి వీలవుతుంది. దీనిని చూశాక మన ముందున్న చెట్లు ఎంత విలువైనవో అర్థమవుతుంది. మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

- నిర్మల, తిరుపతి



ట్యాగ్ ఏ ట్రీ

సైన్సు సెంటర్‌లో 50 వృక్షాలకు క్యూఆర్ కోడ్

మంగళం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఎన్నో వృక్షాలు, మొక్కలు, వనమూలికలు ఉన్నాయి. వాటి గురించి చెప్పగలిగే వాళ్లు అరుదే. దీనిని అధిగమించేందుకు చెట్ల పేరు, అది ఏ ప్రాంతంలో ఎక్కువగా పెరుగుతుంది, దాని లక్షణాలు తదితర వివరాలు అందరికీ తెలియజేయడానికి తిరుపతిలోని సైన్స్‌సెంటర్ ట్యాగ్ ఏ ట్రీ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలుత 50 వృక్షాలకు క్యూఆర్‌కోడ్ ట్యాగింగ్ ఏర్పాటు చేయగా.. దశలవారీగా మిగతా వాటికీ అమర్చనున్నారు. ఈ సైన్స్ సెంటర్‌లో ప్రస్తుతం 1500కుపైగా చెట్లున్నాయి. వీటిలో అరుదైన వృక్షాలు, మొక్కలు, విదేశాలకు చెందిన చెట్లూ ఉన్నాయి. రాయల్‌పామ్, ఫిష్టెల్‌పామ్ వంటి తాటి రకాలు, బొంబాక్స్ సెయిబా, గుల్మోహర్, ఎల్లో ఫ్లేమ్ ట్రీ వంటి పుష్పించే చెట్లతో పాటు జీడిపప్పు, మామిడి వంటివీ ఉన్నాయి. ఆయా వృక్షాల ద్విపద పేరు, సాధారణ పేరు, వర్గీకరణ, స్థానిక పేర్లు, స్థానికత, లక్షణాలు, బయో జియోగ్రఫీ, యత్నో బోటానికల్ వాటికి సంబంధించిన ఫొటోలు కనిపిస్తాయి. దీని ద్వారా ఆ వృక్షాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

సందర్శకుల నుంచి సానుకూల స్పందన



'ట్యాగ్ ఏ ట్రీ' కార్యక్రమానికి సందర్శకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ చెట్ల వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతానికి ఆంగ్ల భాషలో ఈ సమాచారం అందుబాటులో ఉంది. త్వరలో తెలుగు, హిందీ భాషల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తాం.

- పురుషోత్తం, సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్

సాంకేతికతను జోడించడం అభినందనీయం

చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యతను తెలియజేస్తూ దీనికి సాంకేతికతను జోడించడం అభినందనీయం. వృక్షాల గురించి తెలుసుకోవడం, వాటిని కాపాడుకోవడానికి ట్యాగ్ ఏ టీ ఉపయోగపడుతుంది.

- విజయ, చిత్తూరు



ఆ క్వారీ విషయంలో థామస్‌కు సంబంధం లేదు

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీ డబ్బుల విషయంలో వైరల్ అయిన ఆడియో తనదేనని, అయితే దాంతో ఎమ్మెల్యే థామస్‌కు సంబంధం లేదని ఆయన అనుచరుడు హరీష్ యాదవ్ అన్నారు.ఇటీవల గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఒక క్వారీ యజమానికి, హరీష్‌కు మధ్య జరిగిన సంభాషణ ఆడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం హరీష్ చిత్తూరులో మహేష్ జైన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 'క్వారీ విషయంలో వెంకటేష్‌రెడ్డి, మహేష్‌జైన్ మధ్య విభేదాలు వచ్చాయన్నారు.తమ సమస్యలను పరిష్కరించాలని వస్తే ఇద్దరికీ న్యాయం చేయాలనే మానవతా దృక్పథంతో మాత్రమే మాట్లాడానని చెప్పారు.

ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే

చిత్తూరు సెంట్రల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు తాజాగా విడుదల చేశాయి.బహు/ద్వివార్షిక పంటలు తాజా జియో ఫెన్సింగ్‌తో ఫీల్డు సర్వే ఫొటోలు తీయాల్సి ఉంది.క్షేత్రస్థాయి అధికారులు వంద శాతం పంట నమోదు తప్పని సరిగా చేయాలి. ఈకేవైసీ తప్పనిసరి కాదు, కానీ వ్యవసాయదారుల డేటా కచ్చితంగా ఉండాలి.

ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



ఉచిత కంటి పరీక్షలకు ఎంపికైన మహిళలతో జగదీశ్‌బాబు

కుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శారద కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరానికి దాదాపు 120 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 30 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసినవారికి బెంగళూరు శారద కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

మోదీ పాలనలో దేశ వికాసం: బీజేపీ



కుప్పంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తులసీనాథ్ తదితరులు

కుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో భారత దేశం అభివృద్ధితోపాటు అన్నిరంగాల్లో వికసిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ తులసీనాథ్ అన్నారు. మోదీ 11 సంవత్సరాల పాలనలో దేశం సాధించిన విజయాలపై ముద్రించిన కరపత్రాలను బీజేపీ సహచరులతో కలిసి ఆయన ఆదివారం కుప్పంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసీనాథ్ మాట్లాడుతూ సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు గౌరవం, రైతుల సంక్షేమానికి భరోసా, ఆయుష్మాన్ భారత్ ద్వారా అందరికీ ఆరోగ్యం మోదీ పాలనలో లభించిందని పేర్కొన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతోందని.. దేశంలోనే ఎదురులేని శక్తిగా వెలుగొందుతోందని తెలిపారు. పాకిస్తాన్‌పై సాధించిన విజయం దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని, స్థైర్యాన్ని అమాంతం పెంచిందని చెప్పారు. మోదీని ప్రజల గుండెల్లో పెట్టుకున్నారని, మరో పది పదకొండేళ్లపాటు ఆయన పాలనే కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కుప్పం అధ్యక్షుడు వడివేలు, నాయకులు నితీశ్ కుమార్, ఇంద్ర శ్రీహరి, శ్రీధర్, ప్రభాకర్, ప్రతాప్ సింగ్, వసంత్, కుట్టి అశోక్, సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరిధరగుప్తా

పలమనేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధరగుప్తా డిమాండు చేశారు. ఆదివారం పలమనేరులో బిల్డింగ్ కార్మికుల చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, బాషా, శ్రీరామయ్య, వెంకటరమణ, రమణ, శ్రీనప్ప తదితరులు పాల్గొన్నారు.

ధనంజయ నాయుడికి సన్మానం



ధనంజయ నాయుడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లిలో ఆదివారం సింగిల్ విండో అధ్యక్షుడిగా ఎంపికైన ధనంజయనాయుడు, విండో డైరెక్టర్ జయకుమార్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనంజయనాయుడు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి, సహకరించిన మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, రైతులకు వ్యవసాయ రుణాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, రమేష్, కిరణ్‌కుమార్, బాలాజీ, ఆనంద్, వెంకట్రమణ, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

6న కళామందిరం వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పలమనేరు పట్టణంలో నిర్మించిన కళామందిరం మూడో వార్షికోత్సవం జూలై ఆరో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆదివారం చిత్తూరులో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మౌని రచించిన భిన్నధ్రువాలు గ్రంథావిష్కరణ ఉంటుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట్రమణ, జ్ఞానమద్ది విజయ్ భాస్కర్, ఆముదాల మురళి, పుష్ప, చెన్నకేశవులు నాయుడు తదితరులు పాల్గొంటారని వివరించారు. జిల్లాలోని సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

గుడికొత్తూరు మునీశ్వరుడికి ప్రత్యేక పూజలు



గుడుపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికొత్తూరులో ఆదివారం మునీశ్వరుడికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునీశ్వరుడి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి దూరంగా చెట్టు కింద పెద్ద ఆకారంలో మునీశ్వరుడి ప్రతిమను ఎరుపురంగు మట్టితో తీర్చిదిద్దారు. ఆ తరువాత వివిధ రకాల పుష్పాలు, రంగులతో మునీశ్వరుడి ప్రతిమలను అలంకరించారు. గ్రామంలోని మహిళలు పిండి దీపాలు తీసుకొని డప్పు వాయిద్యాతో ఊరేగింపుగా మునీశ్వరుడి ప్రతిమ వద్దకు చేరుకున్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించి మొక్కుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం, జూన్ 29 (ఆంధజ్యోతి): ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు ముందస్తు సమాచారంతో తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని సాకలకుప్పంకు చెందిన శ్రీనివాసులు ద్విచక్రవాహనంలో రాజపేట నుంచి కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా పోలీసులను గుర్తించాడు. తన ద్విచక్ర వాహనాన్ని వదిలి అక్కడ నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అతడిని పట్టుకొన్నారు. సంచిని తనిఖీ చేయగా అందులో 100 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యంతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని శ్రీనివాసులుపై కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మహాభారతం ఉత్సవాలు

వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారతం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీకృష్ణుడు, ధర్మరాజస్వామి, ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నాగరాజు, రూప కుటుంబీకుల వితరణతో భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షులు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు.

ఎల్లప్ప సేవలు అభినందనీయం



ఎల్లప్పకు సన్మానం చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

రొంపిచెర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నగిరి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఈనెల 30న పదవీ విరమణ పొందనున్న వి.ఎల్లప్పను ఆదివారం రొంపిచెర్ల ప్రాథమిక పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో 28 సంవత్సరాలు విద్యార్థుల కోసం చేసిన సేవలను డీవైఈవో ఇందిర, రొంపిచెర్ల ఎంఈవో శ్రీనివాసులు కొనియాడారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, ఎంఈవో సిద్దరామయ్య, ఉపాధాయులు రమణారెడ్డి, నరసింహారెడ్డి, షానవాజ్, చెంగారెడ్డి, నారాయణ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతలు పేదలకు సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మానవతసేవా సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య

పుంగనూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దాతలు పేదలకు సేవలందించడానికి ముందుకు రావాలని పుంగనూరు మానవత సేవా సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థలో సభ్యులుగా చేరాలంటే ఏడాదికి రూ.600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ నానబాల గణేష్ మాట్లాడుతూ పుంగనూరు మానవత సేవా సంస్థతో ఫ్రీజర్ బాక్స్‌లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఏసీ నారాయణరెడ్డి, సంస్థ ప్రతినిధులు పూల త్యాగరాజు, భక్తవత్సలరాజు, జగన్మోహన్‌రెడ్డి, చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, వనిత, హరినాథరెడ్డి, వెంకటముని, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, ద్వారకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన




అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నెలకు కనీస వేతనం రూ. 29 వేలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 అందించాలని.. పారిశుధ్య కార్మికులకు పెంచిన విధంగా ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న వారికి జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు శ్రీరాములు, కుమార్, సుదర్శన్‌రాజు, లజపతి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, గోపీ, జవహర్ అలీ, భాను, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యాపారికి గాయాలు

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఓ వ్యాపారికి గాయాలైన సంఘటన ఆదివారం బోయకొండలో జరిగింది. తిరుపతికి చెందిన భక్తులు ఓ ప్రైవేటు బస్సులో అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. కొండ కింద పొట్టేళ్లు, కోళ్ల క్లీనింగ్ చేసుకుని జీవించే గణేష్ ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

సైనిక్ స్కూల్‌కు పుంగనూరు విద్యార్థి ఎంపిక



పావన్‌సాయి

పుంగనూరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన హరికృష్ణ కుమారుడు పావన్‌సాయి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. పుంగనూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివి ఆల్‌ఇండియాలో 852వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి అన్న మోనీష్ గత ఏడాది సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడంతో స్థానికులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్నచూపు

పుంగనూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్ ఆరోపించారు. ఆదివారం పుంగనూరులో ఉపాధ్యాయుడు రమేష్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా కరువు భత్యాలు ఇవ్వడంలేదని, వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేసి నివేదిక వచ్చే వరకు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆగిన 'పట్టణ ఆరోగ్య కేంద్రం' నిర్మాణం

- నాలుగేళ్లుగా ముందుకు సాగని పనులు
- ఎదురుచూస్తున్న 3600 కుటుంబాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు




గంటావూరు ఇందిరమ్మ కాలనీలో పనులు పూర్తికాని అర్బన్ హెల్త్ సెంటర్ భవనం, అర్బన్ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

పలమనేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని గంటావూరు ఇందిరమ్మకాలనీ వద్ద అర్బన్ హెల్త్‌సెంటర్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగి ప్రస్తుతం అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇందిరమ్మ కాలనీలోని దాదాపు 3 వేలు, బీసీ కాలనీకి చెందిన 200, గంటావూరులోని సుమారు 400 కుటుంబాలకు వైద్యసేవలు అందించేందుకు గత నాలుగేళ్ల క్రితం అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం అప్పట్లో రూ.80 లక్షలు మంజూరు చేసింది. దీంతో అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2021 జూలై 25న ఈ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అయితే ఆ తర్వాత కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేతులు దులుపుకొన్నారు. సకాలంలో చేసిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ ఈ భవన నిర్మాణ పనులను మూడేళ్లపాటు కొనసాగించి ఆపేశారు. గత ఏడాదిగా ఈ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఇక్కడ వైద్యసేవలు ఆశించిన సుమారు 3600 కుటుంబాల వారికి నిరాశే మిగిలింది. అంతేకాక ఈ అసంపూర్తి భవనంలో కొంతవరకు అధికారులు ఫర్నీచర్‌ను తీసుకొచ్చి పడేసివెళ్లారు. ఆ ఫర్నీచర్ నేడు దుమ్ముతో నిండిపోయింది.

భవన నిర్మాణానికి అప్పట్లో వేసిన శిలాఫలకాన్ని సైతం ఇటీవల కొందరు గుర్తుతెలియని దుండగులు పగులగొట్టారు. ప్రస్తుతం మూడు కిలోమీటర్ల దూరంలోని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన పనులను ఇకనైనా అధికారులు స్పందించి పూర్తిచేస్తే కాలనీ వాసులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత-పచ్చదనమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ప్లాంటు శంఖుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం.. పచ్చదనమే ప్రభుత్వ లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పలమనేరు కంపోస్టు యార్డు వద్ద రూ.1.12 కోట్లతో ఏర్పాటు చేస్తున్న బయోరెమిడియేషన్, బయోమైనింగ్ ద్వారా వ్యర్థభూముల పునరుద్ధరణ ప్లాంటుకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంలో పలమనేరును రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిపేందుకు అధికారులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణానికి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలో కంపోస్టు యార్డు ఏర్పాటు చేయడం జరిగిందని.. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతిజ్ఞరూ పనిచేయాలని సూచించారు.

కంపోస్టు యార్డులో ఇప్పటివరకు వేసిన చెత్త నేటికి 13 వేల టన్నులకు పైగా పెరిగిందన్నారు. దీంతో ప్రభుత్వం చెత్తను సేంద్రియ ఎరువులుగా మార్చేందుకు రూ.1.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రజలు భాగస్వాములై గతంలో ఏవిధంగా మున్సిపాలిటీ పారిశుధ్యంలో మొదటి స్థానంలో నిలిచిందో అదే స్థానాన్ని మళ్లీ నిలబెట్టుకోవడానికి సహకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్యంలో మహిళలదే కీలకపాత్ర అన్నారు. ఇంటివద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వి. బాలాజీ, సుబ్రహ్మణ్యంగౌడు, కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, కృష్ణమూర్తి, కిరణ్, మదన్, శ్రీధర్, చాంద్‌బాషా, దిలీప్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏఐజీడీఎస్ ఎన్నికలు ఏకగ్రీవం



నారాయణరెడ్డి, బీపీ రెడ్డి , కె.రామయ్య , రమేశ్ బాబు

పుంగనూరు రూరల్, సదుం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నియోజకవర్గం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.రెడ్డెప్పరెడ్డి, ప్రభాకర్ నాయుడు, విజయ్‌కుమార్ యాదవ్, కార్యదర్శిగా పరికిడొన సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శులుగా రామయ్య, చిదానందం, నారాయణ, కోశాధికారిగా కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నరసింహులు, సురేశ్‌బాబు, హరి, సభ్యులుగా రమేశ్‌బాబు, మోహన్, చంద్రశేఖర్, విజయ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైంది



యాసిన్ షరీఫ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు, అధికారులు

గంగవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైందని గంగవరం ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గంగవరం మండలం బసవరాజపురం ఉర్దూ పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు యాసిన్ షరీఫ్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లపాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన యాసిన్ షరీఫ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలసుందరం, శ్రీనివాసులు, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటా మోహన్‌లతోపాటు పలువురు ఉపాధ్యాయ సం ఘ నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మల శిరస్సు ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి ఉత్సవర్లు

గుడుపల్లె, జూన్ 29 (ఆంధజ్యోతి): మండల పరిధిలోని కమ్మగుట్టపల్లె గ్రామంలో కోట మునీశ్వరుడు, నల్ల గంగమ్మ, ఊరి గంగమ్మ, సల్లాపురమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గంగమ్మ శిరస్సు ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో కోట మునీశ్వరుడు, నల్ల గంగమ్మ మూల విగ్రహాలకు పూజారులు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు పిండిదీపాలు వెలిగించి కోట మునీశ్వరుడకి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

రామకుప్పం, జూన్ 29 (ఆంధజ్యోతి): మండల పరిధిలోని పీఎంకే తాండాలోని గ్రామ సచివాలయంలో కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఈఎస్ ఆస్పత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం జరిగింది. 120 మంది రోగులను పరీక్షించి 15 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందూరులో వారాహి ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సోమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలోనే కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వారాహి రూప ంలో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు అమ్మవారి కీర్తనలు ఆలపించారు. ఉభయదారులు శ్రీదేవి, శివప్రసాద్ దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మాతమ్మ తిరునాళ్ల



ఊరేగుతున్న మాతమ్మ అమ్మవారు

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో ఆదివారం మాతమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి మహిళలు పొంగళ్లతో ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, కరుణాకర్‌నాయుడు, అలీం, రమేష్, ఖాదర్‌వల్లి, అబ్బాస్, అల్తాఫ్ తదితరులకు గ్రామస్తులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

దుర్గామాత ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

వి.కోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన దుర్గామాత ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే అమ్మవారికి పలు రకాల అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి ఎదుట కలశస్థాపన, గణపతి పూజ, నవగ్రహ పూజ జరిపించారు. అనంతరం ఆలయం ఎదుట గణపతి హోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం, మృత్యుంజయ హోమం చేపట్టారు. అనంతరం అమ్మవారి మహాకుంభాభిషేకం జరిగింది. మహిళలచే అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రక్తపంచమి దేవి అలంకారంలో వైష్ణవిదేవి



చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి ఆదివారం వారాహిదేవి నవరాత్రులు సందర్భంగా అమ్మవారు రక్తపంచమి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి


వరుసలో ఉన్న ట్రాక్టర్లు

మామిడి రైతులకు ఊరట

● ఒకటి, రెండ్రోజుల్లోనే కాయల అన్‌లోడ్


టోకెన్ ప్రకారం ట్రాక్టర్‌ను అనుమతిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామ్మోహన్

గుడిపాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామ్మోహన్ చొరవతో మామిడి రైతులకు ఊరట లభించింది. ఒకటి, రెండ్రోజుల్లోనే మామిడి కాయలను అన్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ట్రాక్టర్లు, లారీలను వరుసలో ఉంచి.. టోకెన్లు పంపిణీ చేయడంతో రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుడిపాల మండలమే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వాహనాలను కూడా అనుమతిస్తున్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది సహకారంతో రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూతలపట్టు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఉన్నత పాఠశాలలో 1981-82 నుంచి 1985-86 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి విషయాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

అనాథకు పోలీసుల అంత్యక్రియలు



గంగాధరనెల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో ఓ షాపు వద్ద ఓ అనాథ ఆదివారం మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీనివాసంతి వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుళ్లు దాము, రెడ్డెప్పలను సంఘటన స్థలానికి పంపారు. మృతిచెందిన వ్యక్తి పేరు అన్నామలైగా గుర్తించారు. దీంతో మృతదేహానికి చిత్తూరు నగరంలో పని చేసే ఏఆర్ ఎస్‌ఐ కరుణాకరన్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?



వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేఎంపురం గ్రామ పంచాయతీ గొల్లకండ్రిగలో పశువుల కోసం గతంలో నిర్మించిన నీటి తొట్టి పాచి పట్టింది. నీరు కలుషితమైంది. విధుల్లో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని డీపీవో సుధాకరరావు పదే పదే చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోవడం లేదనడానికి గొల్లకండ్రిగలో ఇదొక సాక్ష్యమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీతో నువ్వు ఉండటమే యోగా పరమార్థం


యోగా శిక్షణకు హాజరైన అభ్యాసకులు

నగరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నీతో నువ్వు ఉండటమే యోగా పరామర్థమని యోగా గురువు పుల్లయ్య తెలిపారు. ఆదివారం నగరిలోని సరస్వతి విజ్ఞాన మందిరంలో మానసిక దృఢత్వానికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో యోగా ఆవశ్యకతను తెలియజేశారు. యోగా నిర్వాహకులు ఎల్లప్పరెడ్డి, బాబు, అభ్యాసకులు పాల్గొన్నారు.


గతంలో..


ప్రస్తుతం..

నగరపాలక కార్యాలయంలో నేడు పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాగుపడ్డ అనుపు రోడ్డు

ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గుడిపాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పానాటూరు పంచాయతీ అనుపు గ్రామానికి ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీన్ని బాగు చేయాలని.. సీసీ రోడ్డు వేయాలని 20 ఏళ్లుగా అడుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఈ మార్గంలో ఏకంగా తారు రోడ్డు వేయడంతో అనుపు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి / ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, వ్యాపారులు



మరుగుదొడ్ల వసతి లేని పూలే విగ్రహం పక్కనున్న కూరగాయల మార్కెట్ - గాంధీ సర్కిల్‌లోని బస్టాప్

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ సర్కిల్‌లో ఉన్న బస్టాప్ వద్దకొచ్చే ప్రయాణికులు, పక్కనే ఉన్న పూలే విగ్రహం సమీపంలోని కూరగాయల వ్యాపారులు, ఇక్కడికొచ్చే జనం మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో పాతబస్టాండు ఉన్నపుడు అందులో మరుగుదొడ్లు ఉండేవి. పాతబస్టాండును తొలగించడంతో బస్సులన్నీ గాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన బస్టాప్ వద్దే ఆగుతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం జనం, విద్యార్థులు వస్తుంటారు. వీరికితోడు కూరగాయల వ్యాపారులు, కొనుగోలుకు వచ్చే జనం కూడా ఎక్కువగా ఉంటున్నారు. ఈ పరిసరాల్లో ఎక్కడా మరుగుదొడ్ల వసతి లేక వీరంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాగా, పీసీఆర్ కళాశాల పక్కనే (రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన) పెద్ద డ్రైనేజీ కాలువ ప్రవహిస్తోంది. దీనిపై మరుగుదొడ్లు నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని జనం అంటున్నారు.


పీసీఆర్ కళాశాల పక్కన మరుగుదొడ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్న స్థలం

టీడీపీ ఫ్లెక్సీ చించివేత

● కేసు నమోదు చేసిన పోలీసులు



శ్రీరంగరాజపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ థామస్ జన్మదినం సందర్భంగా పిళ్లారికుప్పం క్రాస్ వద్ద టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' కలయిక



వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు వేయింగ్ మిషన్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత తగ్గువారిపల్లె జట్టు



బంగారుపాళ్యం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బలిజపల్లెలో జరుగుతున్న ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్ ఆదివారం జరిగాయి. తగ్గువారిపల్లె, బలిజపల్లె జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో తగ్గువారిపల్లె జట్టు విజేతగా నిలిచింది. వీరికి మొదటి బహుమతిగా రూ.15వేలను శేషాపురానికి చెందిన ఎన్ఆర్ఐ చరణ్ గుడివాడ అందజేశారు. రెండు బహుమతిగా బలిజపల్లె జట్టుకు రూ.10వేలను సర్పంచు శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఆర్గనైజర్లు మహేష్, జయకుమార్, ప్రేమ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



పూతలపట్టు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోటుకనుమ గ్రామంలో కొన్ని రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞం ఆదివారం జరిగిన దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. ఇందులో భాగంగా మట్టితో చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద దుర్యోధనుడు, భీముడి వేషధారులు పౌరాణిక పద్యాలు పాడుతూ యుద్ధ సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతరం దుర్యోధనుడి ప్రతిమ మట్టి కోసం జనం ఎగబడ్డారు.

కంటి ఆపరేషన్లకు 102 మంది ఎంపిక



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాముల గుడి వీధిలోని జైన్ ప్రార్థనామందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నేత్రవైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద నేత్రవైద్యశాల వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి 202 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 102 మందిని కంటి ఆపరేషన్లు ఎంపిక చేశారు. వీరికి చిత్తూరు జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, ఎవంత్, జ్యోతి, విషాల్, ఆనంద్, రాజేష్ జతిన్, అమిత్ జైన్లు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు, ధర్మరాజస్వామి, ద్రౌపది అమ్మవారు

వెదురుకుప్పం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీకృష్ణుడు, ధర్మరాజస్వామి, ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నాగరాజు, రూప కుటుంబీకుల వితరణతో భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షులు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు



గంగాధరనెల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వేపంజేరి గ్రామంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మొదటగా స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి.. నిత్యపూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడికి పట్టువస్త్రాలు, పూల హారాలతో అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి రమాదేవి హరికథా కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను రాజేష్‌కుమార్ ఆలపించారు. ఈకార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మునీశ్వరుడికి పొంగళ్ల సమర్పణ



గుడుపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల పరిధిలోని గుడికొత్తూరులో ఆదివారం మునీశ్వరుడికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునీశ్వరుడి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి దూరంగా చెట్టు కింద పెద్ద ఆకారంలో మునీశ్వరుడి ప్రతిమను ఎరుపురంగు మట్టితో తీర్చిదిద్దారు. ఆ తర్వాత వివిధ రకాల పుష్పాలు, రంగులతో మునీశ్వరుడి ప్రతిమలను అలంకరించారు. మహిళలు పిండి దీపాలు తీసుకొని డప్పు వాయిద్యాతో ఊరేగింపుగా మునీశ్వరుడి ప్రతిమ వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించి మొక్కుకున్నారు.

లెనిన్‌నగర్ నుంచి కంపోస్టు యార్డును తరలించండి: సీపీఐ

చిత్తూరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లెనిన్ నగర్ నుంచి కంపోస్టు యార్డును తరలించి, స్థానికుల ఆరోగ్యాన్ని రక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం లెనిన్‌నగర్ వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. నగరంలోని 50 వార్డుల్లోని వ్యర్థాలను లెనిన్ నగరంలోని కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారని చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కాలడం వల్ల వచ్చే పొగతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మణి, జమీలాబి, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.


లెనిన్ నగర్ వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సంక్షిప్తంగా..

మంచికి ప్రతిరూపం 'రామాయణం'

చిత్తూరు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంచికి ప్రతిరూపం 'రామాయణం' అని ప్రముఖ ప్రవచనకర్త శీలానంద అన్నారు. వారం రోజులుగా గిరింపేట దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక ఆలయం వద్ద చిన్మయ యోగాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో రామాయణ జ్ఞాన యజ్ఞ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రామాయణంలోని ధర్మ సూక్ష్మాలను భక్తులకు తెలియజేశారు. ఆదివారంతో ఈ కార్యక్రమం ముగియడంతో శీలానందను నిర్వాహకులు సత్కరించారు.

6న కళామందిరం వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పలమనేరు పట్టణంలో నిర్మించిన కళామందిరం మూడో వార్షికోత్సవం జూలై ఆరో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆదివారం చిత్తూరులో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మౌని రచించిన భిన్నధృవాలు గ్రంథావిష్కరణ ఉంటుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట్రమణ, జ్ఞానమద్ది విజయ్ భాస్కర్, ఆముదాల మురళి, పుష్ప, చెన్నకేశవులు నాయుడు తదితరులు పాల్గొంటారని వివరించారు. జిల్లాలోని సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు పక్కకు వాలిన మినీ లారీ



పూతలపట్టు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుంచి తిరుపతికి పార్శిళ్లను తీసుకెళుతున్న మినీ లారీ ఒకటి రంగంపేట క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం అదుపుతప్పి రోడ్డు పక్కకు వాలింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సంతపేట బండవీధిలో దుర్గా ప్రసాద్ కుటుంబం నివాసముంది. ఈనెల 27వ తేదీన వారింటికి ఎదురు ఇంట్లో ఉన్న నరేష్.. మరికొంత మందితో మద్యం తాగి అల్లరి చేశారు. దీనిపై ప్రశ్నించిన దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులపై నరేష్, అతడి స్నేహితులు దాడికి ప్రయత్నించారు. ఈఘటనపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

● వ్యాపారికి గాయాలు

చౌడేపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఓ వ్యాపారికి గాయాలైన సంఘటన ఆదివారం బోయకొండలో జరిగింది. తిరుపతికి చెందిన భక్తులు ఓ ప్రైవేటు బస్సులో అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. కొండ కింద పొట్టేళ్లు, కోళ్లు క్లీనింగ్ చేసుకుని జీవించే గణేష్ ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

కందూరులో వారాహి ఉత్సవాలు

సోమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఈక్రమంలోనే కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వారాహి రూపంలో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు అమ్మవారి కీర్తనలు ఆలపించారు. ఉభయదారులు శ్రీదేవి, శివప్రసాద్ దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మాతమ్మ తిరునాళ్ల

కల్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో ఆదివారం మాతమ్మ తిరునాళ్ల జరిగింది. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి మహిళలు పొంగళ్లతో ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి,మురళీధర్‌నాయుడు, కరుణాకర్‌నాయుడు, అలీం, రమేష్, ఖాదర్ వల్లి, అబ్బాస్, అల్తాఫ్‌లకు గ్రామస్తులు స్వాగతంపలికి అమ్మవారి దర్శనం కల్పించారు.